క్లుప్తంగా

నాగార్పమ్మకు పొంగళ్లు



విద్యుత్‌దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

ఓజిలి: గ్రామదేవత శ్రీనాగార్పమ్మవారికి గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, మూడురోజుల జాతరను ప్రారంభించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



ప్రొఫెసర్ సాయికృష్ణను సన్మానిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జేఎన్‌టీయూఏ సహకారంతో ఐదురోజులుగా జరుగుతున్న అధ్యాపకుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు బెంగళూరులోని గ్లోబల్ ఫౌండేషన్ ప్రధాన ఇంజినీర్ డాక్టర్ వాసుదేవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తిరుపతి ఐఐటీ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ సాయికృష్ణ అటానమిక్ క్లౌడ్ కంప్యూటరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ హరనాథ్‌రెడ్డి, కార్యక్రమం కోఆర్డీనేటర్ మెహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మానవత్వం చాటిన తహసీల్దార్



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్ లీలారాణి

గూడూరురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, మంచానికే పరిమితమైన నరసింగరావుపేటకు చెందిన బోసు వెంకట అఖిల్‌కు స్థానిక తహసీల్దార్ లీలారాణికి రూ.1.07 లక్షలు వితరణ చేసి, తన మానవత్వం చాటుకున్నారు. బోసు వెంకట అఖిల్ ఇటీవల సైదాపురం మండలం కలిచేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, వెన్నెముక దెబ్బతినడంతో రెండు కాళ్లు పూర్తిగా చచ్చు పడిపోయాయి. అఖిల్ కుటుంబ సభ్యులు తమ పరిస్థితిని గూడూరు తహసీల్దార్ లీలారాణి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో చలించిన ఆమె, కార్యాలయ సిబ్బంది కలిసి వెంకట అఖిల్ కుటుంబ పోషణ, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,07 లక్షల నగదును శుక్రవారం సాయంత్రం అందజేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. తహసీల్దార్ లీలారాణికి అఖిల్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లి): వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలాయపల్లె పీహెచ్‌సీ వైద్యులు కళ్యాణ్‌చక్రవర్తి, ప్రమీల శుక్రవారం ఓ సంయుక్త తెలిపారు. మండుటెండలో శ్రమతోకూడిన పనులు చేయడం, ఎండలో అధికంగా తిరగడం, మద్యం సేవించడం, ముదురు రంగు, నలుపు రంగుల బట్టలు ధరించడం వంటివి చేయకూడదన్నారు.

నేడు మండల మీట్

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ సురేష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పరంగా చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొనాలని కోరారు.

నాయుడుపేటను ప్రథమస్థానంలో నిలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నాయుడుపేట మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలుపుదామని చైర్ పర్సన్ కటకం దీపిక పిలుపునిచ్చారు. మేరా లైఫ్‌- మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన పారిశుద్ధ కార్మికులు, మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా కార్మికులందరికీ ఎండ తీవ్రతకు తట్టుకునేందుకు టోపీలను చైర్ పర్సన్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు పారి శుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పనులు చేస్తున్నారన్నారు. ప్రజలు కూడ సహకరించి పరిశుభ్రతకు తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు.

సిలికా పోటు..జీడి మామిడికి చేటు

రైతులకు వేరుశనగ సాగుపై పెరిగిన మక్కువ.. సిలికా తవ్వకాలకు డిమాండ్.. రిజర్వ్ ఫారెస్టు భూముల్లో సిలికా తవ్వకాలు.. కొరవడిన ఉద్యానవన శాఖ అధికారుల ప్రోత్సాహం.. వెరసి తీరప్రాంతంలోని జీడి మామిడి అంతరించిపోతోంది. ఫలితంగా గిరిజనులు బతుకుదెరువు కోల్పోతున్నారు.



అంతరించి పోతున్న జీడిమామిడి చెట్లు

చిల్లకూరు: తీర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఉన్న రిజర్వు ఫారెస్టు, సిలికా భూముల్లో ప్రకృతి సిద్ధంగా మొల్లకెత్తిన జీడి మామిడి చెట్లు రోజురోజుకూ అంతరించిపోతున్నాయి. ఒకప్పుడు ఈ చెట్లు ఆయా గ్రామాల్లోని గిరిజనులు, గ్రామస్తులకు బతుకు దెరువును అందించేవి. అయితే నేడు కనీస ఫలసాయం కూడా అందని పరిస్థితి నెలకొంది. తీర ప్రాంతంలోని తమ్మినపట్నం నుంచి వేళ్లపాళెం వరకు కొన్ని వందల ఎకరాల్లో జీడిమామిడి 10 ఏళ్ల కిందటి వరకు సాగులో ఉండేది. అప్పట్లో సీజన్ వచ్చిందంటే సుమారు 100 టన్నుల వరకు ఇక్కడ నుంచి జీడి మామిడి ఎగుమతి జరిగేది. అయితే ఇటీవల కాలంలో సిలికాకు విపరీతమైన గిరాకీ ఏర్పడడంతో లీజులు పొందిన వారు ఏళ్లగా ఉన్న చెట్లను కొట్టివేస్తున్నారు. ఇటీవల మోమిడి రెవెన్యూ పరిధిలోని సుమారు 32 ఎకరాల రిజర్వు ఫారెస్టులో కూడా సిలికా తవ్వకాల అనుమతులు కోరుతూ కొంత మంది దరఖాస్తు చేసుకోవడంతో అధికారులు అనుమతులు ఇచ్చేందుకు పరిశీలన చేశారు. అనుమతులు ఇస్తే సుమారు 200 జీడి మామిడి చెట్లు తొలగించే అవకాశం ఉంది. ఇలా జీడి మామిడి అంతరించి పోతోంది. ఎంతో మంది గిరిజనులకు బతుకుదెరువు అందించే జీడి మామిడి అంతరించి పోతే పూర్తిగా ఈ ప్రాంతంలో ఆ చెట్ల ఆనవాళ్లు కూడా లేకుండా పోయి, గిరిజనులకు జీవనం కరువు అవుతుంది.

ఉద్యానవన శాఖ నిర్లక్ష్యంతోనే..

చిల్లకూరు, కోట మండలాల్లోని తీర ప్రాంతంలో ఉన్న సిలికా భూముల్లో జీడిమామిడి సాగుపై ఉద్యానవన శాఖ స్థాయిలో దృష్టి సారించక పోవడంతో ఆ చెట్లు అంతరిస్తున్నాయి. దీనికితోడు రైతులు వేరుశనగ సాగుపై మక్కువ చూపడంతో క్రమేపి జీడిమామడి సాగు అంతరించి పోతోంది. అలాగే ప్రస్తుతం రిజర్వు ఫారెస్టు భూమి సిలికా తవ్వకాలకు అప్పగిస్తుండడంతో జీడిమామిడి సాగు పూర్తిగా అంతరించే స్థాయికి చేరుకుంది.

నాలుగు నెలల ఉపాధి దొరికేది



చిన్నతనం నుంచి గ్రామానికి సమీపంలో ఉన్న జీడి మామిడితో మా కుటుంబం మొత్తం నాలుగు నెలల పాటు పనికి వెళ్లకుండా జీవనం సాగించేవారం. ఇప్పుడు చెట్లు పూర్తిగా కొట్టి వేస్తుండంతో ఎండా కాలం వస్తే పిల్లలకి ముంతమామిడి పండ్లు తినేందుకు కూడా వెతికి తీసుకురావాల్సి వస్తుంది. ఇటీవల రిజర్వు ఫారెస్టు కూడా సిలికా తవ్వకాలకు తీసుకుంటారని తెలిసింది. ఇకపై జీడి మామిడి చెట్లు మా పిల్లలు చూడలేరు.

\- మానికల మణి, పునుగుంటపాళెం

500 ఎకరాలకు పైగా ఉండేది



తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు నుంచి కోట మండలం సిద్దవరం వరకు సుమారు 500 ఎకరాల వరకు జీడిమామిడి సాగులో ఉండేది. అప్పుడు వేసవి కాలం వచ్చిందంటే నాలుగు లోడ్లు జీడి మామిడి గింజలను శ్రీకాకుళం నగరానికి పంపేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. చెట్లను కొంత మంది కొట్టి వేసి, వేరుశనగ సాగు చేస్తున్నారు. కొంత మంది జీడిమామిడి ఉన్న భూమిని సిలికా తవ్వకాలకు ఉపయోగించడంతో పూర్తిగా జీడి మామిడి అంతరించి పోతుంది.

\- చాకిరి సురేష్, తూర్పుకనుపూరు

వేరుశనగ సాగుతోనే తగ్గి పోతుంది

తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఉన్న సిలికా భూముల్లో గతంలో జీడిమామిడి సాగులో ఉండేది. కొంత కాలం క్రితం పరిశ్రమల కోసం కొంత మేరకు భూములు తీసుకోవడం, ఆ ప్రాంతంలోని రైతులు జీడి మామిడితో సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఆదాయం పొందుతున్నామని వేరుశనగ సాగుపై మక్కువ చూపుతున్నారు. దీంతో జీడిమామిడి చెట్లును కొట్టి వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జీడిమామిడి సాగుకు త్వరలో ప్రోత్సాహం వస్తుంది.

\- కార్తీక్, ఉద్యానవన శాఖాధికారి, గూడూరు

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

తడ పేద ప్రజలు అభ్యున్నతి కోసమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వాటంబేడు కుప్పం, పాలముల మిట్ట గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు గ్రామీణులు బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే కిలివేటి సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు, రైతులు, అన్ని వర్గా పేదలకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి పనులు చేస్తే మేలు చేకూరుతుందో ఆలోచిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందేలా చర్యలు తీసుకోవడం ఆయన అద్భుతమైన పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే.రఘురెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, సర్పంచ్‌లు దొడ్లు సునీల్‌రెడ్డి, మహాలక్ష్మి, నాయకులు నరేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వెంకటగిరి: వలంటీర్లను సత్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను దేశంలో పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వైఎస్సార్ సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పద్మశాలి కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు సేవా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. త్వరలో వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. అనంతరం పట్టణ పరిధిలోని ఐదుగురు వలంటీర్లకు సేవారత్న అవార్డులు, మిగిలిన వలంటీర్ల సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్లు సీహెచ్ ఉమామహేశ్వరి, శేతురాశి బాలయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మహిళావిభాగం నేత ధనియాల రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ సంక్షేమంతో సంతోషం



సైదాపురం: లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందుతూ ప్రజలందరూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. వేములచేడు మెయిన్, ఎస్సీ కాలనీలు, నల్లబోట్లపల్లె, పాతాలపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి ఈ సందర్భంగా 450 కుటుంబాలకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేదురుమల్లి మాట్లాడుతూ అమరావతిలో నిరుపేదలకు ఉచితంగా ఇంటి స్థలాలను ఇవ్వడం చాల శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నృత్య అకాడమి చైర్మన్ పొట్టేళ్ల శిరిషాయాదవ్, జేసీఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ చెమిర్తి జనార్దన్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శంకర్‌రాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కరణం శ్రీనివాసులునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు నేతలు ప్రభాకర్ రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



బహుమతులు, షీల్డులు అందుకున్న విద్యార్థులతో పొనకా దేవసేనమ్మ

గూడూరు: విద్యార్థులు బాగా చదివి, ఉన్నతస్థాయికి ఎదగాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీఎస్‌ఆర్ ట్రస్టు దాతృత్వంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు వాచీలు, గోల్డ్ రింగులను దేవసేనమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. తద్వారా జూనియర్ విద్యార్థుల్లో బాగా చదవాలనే ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, రవూఫ్, పురుషోత్తం, గోపాల్ యాదవ్, రామ్మోహన్‌రావు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధోత్సవం



గంధం ఊరేగింపులో కమిటీ సభ్యులు



అన్నదానం చేస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలో ఉన్న హాజరత్ ఖాదర్‌షావలీ (చిన్నదర్గా) గంధోత్సవం శుక్రవారం రాత్రి పలు సంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ముగిసింది. తెల్లవారు జామున దర్గా వద్దకు చేరుకున్న గంధాన్ని ముజావర్లు, ఫకీర్ల విన్యాసాల నడుమ దర్గాలో ప్రతిష్టించి ఫాతేహాలు జరిపి, భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం గిండి రోహిణీకుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దర్గా వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. రాత్రి చిన్నదర్గా కమిటీ సభ్యుల సారధ్యంలో జరిపిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

భూ సేకరణపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: సాగరమాల భూసేకరణకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సాగరమాల రహదారికి సేకరించిన భూమి యజమానులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, త్వరగా రివార్డులు తీసుకునేలా చూడాలన్నారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకూ సబంధించిన పూర్తి వివరాలను సేకరించాలన్నారు. కొంత మంది ఇతర దేశాల్లో ఉన్నారని, వారి వివరాలు సేకరించాలంటే ఇబ్బందిగా ఉందని ఈ సందర్భంగా వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఉన్నా, ఎవరిమీద నైనా పవర్ ఆఫ్ పట్టా తీసుకున్నా వారిని సిఫార్సు చేయవచ్చని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రమ్య స్వాతి తదితరులు ఉన్నారు.

ఓజిలిలో వానర బెడద



ఓజిలి: రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయాలకు వచ్చే ప్రజలు వానరాల బెడదతో హడలిపోతున్నారు. చెట్లపై సంచరిస్తున్న వానరాలు కార్యాలయాల్లో పనులకు కోసం వచ్చే ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మండల కార్యాలయంలో నిత్యం అధికంగా వానరాలు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎవరిపై దాడులు చేస్తాయో? తెలియక ప్రజలు అవస్థ పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారిపై కూడా కోతులు దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతులను పట్టించాలని కోరుతున్నారు.

వలంటీర్లకు పురస్కారాల పంపిణీ



వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

పెళ్లకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి శుక్రవారం నెలబల్లి, పుల్లూరు, కలవకూరు సచివాలయాల పరిధిలోని వలంటీర్లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు చెంచురామయ్య, శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ సురేష్‌బాబు, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మారాబత్తిన సుధాకర్, నాయకులు సుధాకర్‌నాయుడు, చక్రపాణి, జితేంద్ర, చెంగయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో మేలు

రాపూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని గ్రంథాలయాధికారి ధనమ్మ అన్నారు. రాపూరు గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం గ్రంథాలయాల్లో దినపత్రిక విశేషాలు, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారదర్శకంగా విచారణ

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఆడిట్ బృందాలు తనిఖీ చేసే సమయంలో పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ గోపీనాథ్ సూచించారు. మండల పరిషత్‌లోని ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఆడిట్ బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో రూ 9.46 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ఆ పనుల్లో ఏవైనా అవకతవకలు ఉన్నాయా? అనే విషయాలను తనిఖీ చేసి, ఎంత మేర నిధులు ఖర్చు చేశారు.. ఎవరికైనా వేతనాలు సరిగా అందలేదా? అన్న విషయాలను నమోదు చేయాలన్నారు. ఆడిట్ బృందాలు శనివారం నుంచి గ్రామాలకు వెళ్లి పనులు తనిఖీ చేసి, ఈ నెల 31వ తేదీలోగా నివేదికలను ఇవ్వాలన్నారు. ఉపాధి ఏపీఓ గిరి, ఆడిట్ సీఆర్‌పీ నాగరాజు తదితరులు ఉన్నారు.

కండలేరులో 31.230 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 31.230 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 110, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు180, హైలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

నేడు గొట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

నాయుడుపేటటౌన్: మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారధ్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే, అధికారులు, సచివాలయ ఉద్యోగులు వలంటీర్ల కలసి జరిపే ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పొలూరులో..

సైదాపురం: మండలంలోని పొలూరు పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

30 నుంచి ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి జూన్ 9వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఈఓ నవీన్‌కుమార్, పాలక మండలి సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 30 నుంచి జూన్ 9వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈఓ నవీన్‌కుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, అలాగే పది రోజులు స్వామివారికి నూతనంగా తయారు చేయించిన బంగారు కిరీటం అలంకరించనున్నట్లు చెప్పారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు అన్నం రఘురామయ్య, పాదర్తి సుప్రజ, కృష్ణయ్య, వాచస్పతి, సురేంద్ర, పాదర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోనే విద్యాకానుక



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని (జగనన్న విద్యా కానుక) కిట్లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గూడూరులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుక కిట్లను విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంస్కరణలో భాగంగా నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచడంతోపాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఆయన వెంట ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఎంఈఓ దేవరాజులరెడ్డి, హెచ్.ఎం. రవూఫ్, తదితరులు ఉన్నారు.

నిధుల కొరత లేదు



నూతన సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

కోట: నూతన సచివాలయల భవనాల నిర్మాణాలకు నిధులు కొరత లేదని నెల్లూరు జెడ్పీ సీఈఓ చిరంజీవి తెలిపారు. కోటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి పనికి సంబంధించిన రికార్డును కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం కోట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాలను పరిశీలించి, పనులు ఆపడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బిల్లులు చెల్లించకపోవడంతో నిలిపివేసినట్లు కాంట్రాక్టర్లు తెలిపారని అన్నారు. దీంతో సీఈఓ మాట్లాడుతూ నూతన భవనాలకు నిధుల కొరత ఎంత మాత్రం లేదని, భవన నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లను నేరుగా తనతో కలసి మాట్లాడితే బిల్లులు ఇప్పించేలా చూస్తామని చెప్పారు.

వలంటీర్లకు వందనం నేడు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రూరల్ మండలానికి సంబంధించి 20 పంచాయతీల పరిధిలో ఉన్న వలంటీర్లకు శనివారం పట్టణంలోని పద్మశాలీయుల కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కరిముల్లా తెలిపారు. రూరల్ మండలానికి సంబంధించిన వలంటీర్లు, సచివాలయం అధికారులు విధిగా పాల్గొన్నాలని సూచించారు.